క్లుప్తంగా

ఖత్మే ఖురాన్ వేడుకలు

ఖమ్మం మామిళ్లగూడెం: నగర శివారు గొల్ల గూడెంలోని తాలిముల్ ఇస్లాం మదర్సాలో సోమవారం ఖత్మే ఖురాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తరావీహ నమాజ్‌లో కేవలం తొమ్మిది రోజుల్లోనే ఖురాన్ పఠనం పూర్తి చేసిన సందర్భంగా వేడుకలు నిర్వహించినట్లు ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మీ తెలిపారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ వీలైనంత సమయం ఖురాన్‌తో గడపాలని, దాన ధర్మాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంతకు ముందు మదర్సాలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. అఫ్జల్ హసన్, సయ్యద్ ఇస్మాయిల్, యాకుబ్ పాషా, ఖాజా ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం..


నగదు అందిస్తున్న వీరారెడ్డి

కూసుమంచి: మండలంలోని జక్కేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న గండి బ్లెస్సీ అనే విద్యార్థిని చదువులో ప్రతిభ కనబరుస్తుండడంతో గ్రామానికి చెందిన తిప్పని వీరారెడ్డిని సోమవారం రూ.5వేల నగదును విద్యార్థినికి అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాంకోటి, హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కొత్త ఇందిర , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెటర్ల కోసం ఫ్రిజ్ వితరణ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని నెట్స్‌లో ప్రాక్టీస్ చేసే క్రికెట్ క్రీడాకారులకు తాగునీటి సౌకర్యం కోసం పూల వ్యాపారి సర్దార్ ఫ్లవర్స్ బాధ్యులు ఫ్రిజ్ సమకూర్చారు. రూ.15వేల విలువైన ఫ్రిజ్ అందజేయడం అభినందనీయమని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, క్రికెట్ కోచ్ ఎం.డీ.మతిన్ తెలిపారు.

మంగాపురంతండా వాసికి మెడిసిన్ పీజీ సీటు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాకు చెందిన ధనావత్ ప్రియాంక మెడిసిన్ పీజీ సీటు సాధించింది. ఆమె తండ్రి వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా.. విజయవాడలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ప్రియాంక తమిళనాడులోని ధర్మపురి మెడికల్ కాలేజీలో గైనకాలజీ విభాగంలో సీటు సాధించింది. ఆమెను పలువురు అభినందించారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల డాక్టరేట్ అందుకున్న ఖమ్మంకు చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్ చోటేబాబాను సోమవారం పలువురు సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎం.డీ.అఫ్జల్, మంద వెంకటేశ్వర్లుతో పాటు ఎం.డీ.నవాజ్, ఖాజా, మల్సూర్, అర్షద్, చాంద్‌పాషా, రాధాకృష్ణ, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఖాదర్ బాబా, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో గోటి తలంబ్రాలు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ రామాలయంలో గోటి తలంబ్రాలు వలిచే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొనగా, శ్రీరామ నవమి రోజున జరిగే శ్రీసీతారాముల కల్యాణం కోసం తలంబ్రాలు సిద్ధం చేస్తున్నారు. ఆలయంలో మూడు రోజులు పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు
వినోద	ఛావా
సాయిరాం	రాక్షస
ఆదిత్య	కింగ్‌స్టన్
శ్రీనివాస	శబ్దం

\- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	28		20
బెండకాయ	58	పాలకూర	4
పచ్చిమిర్చి	28		20
కాకర	48	చుక్కకూర	4
బోడ కాకర	120		20
బీర	54	తోటకూర	4
దొండ	44		20
పొట్లకాయ	38	గోంగూర	3
చిక్కుడు	78		20
గోరుచిక్కుడు	54	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		25
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	28		20
క్యాప్సికం	48	-ఖమ్మం వ్యవసాయం	

అవే సమస్యలు.. అవే ఫిర్యాదులు..


కమిషనర్‌కు అర్జీ అందించి సమస్యను వివరిస్తున్న ఫిర్యాదుదారుడు

కేఎంసీ గ్రీవెన్స్‌లో 70 ఫిర్యాదులు

- అధికంగా రెవెన్యూ విభాగానికి 55 ఆర్జీలు
- తక్షణ పరిష్కారం కోసం కమిషనర్ ఆదేశాలు

ఖమ్మంమయూరిసెంటర్: కొన్ని వారాలుగా కేఎంసీ నగర పాలకసంస్థకు అర్జీదారుల తాకిడి పెరుగుతోంది. సోమవారం వచ్చిందంటే చాలు చేతిలో అర్జీ పేపర్లు పట్టుకొని అధికారుల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. అయితే గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించినవే ఉండడం గమనార్హం. సోమవారం కేఎంసీ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. ఇంటి పన్ను అధికంగా వస్తుందని, తమ పేర్లు తప్పులు ఉన్నాయంటూ తదితర సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. మొత్తం 70 ఫిర్యాదులు రాగా.. వాటిలో రెవెన్యూ విభాగానికి 55, టౌన్ ప్లానింగ్‌కు 10, ఇంజనీరింగ్ విభాగానికి 5 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

అదే రోజు పరిష్కరించాలి..

రెవెన్యూ విభాగానికి చెందిన సమస్యలపై గ్రీవెన్స్‌లో అందజేసిన అర్జీలను పరిశీలించి అదే రోజు పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు తప్పనిసరిగా గ్రీవెన్స్‌లో పాల్గొనాలని, వారి విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి అక్కడిక్కడే పరిష్కరించి అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. మరోసారి అదే సమస్యపై ఏ అర్జీదారుడు కార్యాలయానికి రాకుండా చూడాలని ఆదేశించారు.

అధికారుల జీతాల్లో కోత..

కేఎంసీలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు అధికారులు సకాలంలో హాజరు కాకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పలుమార్లు ఆదేశించినా అధికారులు సమయపాలన పాటించకపోవడంతో సంబంధిత అధికారుల వేతనాల్లో కోత విధించాలని బాధ్యులను ఆదేశించినట్లు సమాచారం. ప్రజల ఫిర్యాదులు అందించేందుకు రాగా.. గ్రీవెన్స్‌లో అధికారులు లేకపోతే ఎలా అని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మొక్కుబడిగా మండలస్థాయి గ్రీవెన్స్..


ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నేలకొండపల్లి: స్థానిక తహసీల్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కాకుండా మొక్కుబడిగా ముగిస్తున్నారు. కేవలం తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ, ట్రాన్స్‌కో, ఐసీడీఎస్ మండల స్థాయి అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. ఇక ఇరిగేషన్ ఒక లష్కర్‌ను, విద్య శాఖ ఓ సీఆర్‌పీ, వైద్య శాఖ హెచ్‌ఈఓ ఇలా ప్రతీ శాఖ అధికారులు కేవలం వారి కింద స్థాయి సిబ్బందిని పంపిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఈనేపథ్యాన మండలంలోని బైరవునపల్లికి చెందిన రైతులు రహదారి ఆగిపోయి.. తాము ఇబ్బంది పడుతున్నామని విన్నవించినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. కానీ వివరణ ఇచ్చేందుకు సంబంధిత అధికారులు మాత్రం లేకపోవడం గమనార్హం. ఇలా మొత్తంగా పట్టుమని పది మంది అధికారులు లేరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అగ్నిమాపక శాఖ, అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యా శాఖ, ఎక్సైజ్, పోలీస్ తదితర శాఖల అధికారులు గ్రీవెన్స్ వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆలయ భూములు కాపాడాలని వినతి..


వినతి పత్రం ఇస్తున్న కొక్కిరేణి గ్రామస్తులు

తిరుమలయపాలెం: మండలంలోని కొక్కిరేణి గ్రామంలో ఉన్న పురాతన శివాలయం చుట్టూ ఉన్న భూములను కాపాడాలని సోమవారం తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో తహసీల్దార్, ఎంపీడీఓలకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రజలు, పెద్దలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆలయ అభివృద్ధికి పనులు ప్రారంభించామని, ఆలయం చుట్టూ సరిహద్దులు ఏర్పాటు చేసి భూమి ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గంటా కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వారబందీ విధానం రద్దు చేయాలి


ఇరిగేషన్ ఏఈకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నేలకొండపల్లి: సాగు నీటి సరఫరాలో వారబందీ విధానాన్ని రద్దు చేసి నిరంతరం నీటిని అందించాలని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఈమేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇరిగేషన్ ఏఈకి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారబందీ విధానంతో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. పాలేరు పాత కాలువ, మంగాపురం మేజర్‌లకు నీటిని నిరంతరం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడారు. ఈ నెల 25న మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రచ్చా నరసింహారావు, గుడవర్తి నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, కొండలరావు, దండా సూర్యనారాయణ, ఎడ్ల తిరపతిరావు, కూరపాటి ప్రసాద్, దుగ్గి నరసింహారావు, బలుసు ప్రమీలా, రాసాల నవీన్, బొడ్డు మధు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఐక్యత చాటుదాం..


మాట్లాడుతున్న మామిడి సోమయ్య

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యత చాటుదామని తెలంగాణ జర్నలిస్ట్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్యతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వాలు అందించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండల్‌రావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, పారుపల్లి కృష్ణారావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, జక్కంపుడి కృష్ణ, నాగుల్‌మీరా, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్య స్ఫూర్తి.. | సావిత్రీబాయి పూలే

భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను సోమవారం పలు యూనియన్లు, సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడి, ఆమెకు భారత రత్న ఇవ్వాలని, వర్ధంతి, జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆమె పేరున అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ ఎదుట నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బాధ్యులు


ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ ఎదుట పీడీఎస్‌యూ నాయకుల నివాళి


ఖమ్మం మామిళ్లగూడెం: వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో..

చలివేంద్రం ప్రారంభం

నేలకొండపల్లి: మండల కేంద్రంలో మాటూరి సుగుణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాటూరి శేషగిరిరావు, ఎం.సుబ్రహ్మణ్యం, వంగవీటి నాగేశ్వరరావు, కొత్తా రమేష్, దోసపాటి చంద్రశేఖర్, రేగూరి హన్మంతరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫేర్


ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న నిష్ఠాశర్మ

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో సోమవారం ఏర్పాటుచేసిన సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఎగ్జిబిట్లను పరిశీలించిన స్కూల్ చైర్‌పర్సన్ నిష్ఠాశర్మ మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్ర, పరిశోధనారంగాలపై ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్‌ఐ కామరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల ఊరేగింపు

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నేడు పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

నేలకొండపల్లి: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మండలంలో పర్యటించనున్నారని మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మండల నాయకులతో సమావేశమై మాట్లాడారు. అనాసాగారం, సదాశివాపురం, నేలకొండపల్లి, చెరువుమాధారం, అమ్మగూడెం, రాజేశ్వరపురం, చెన్నారం , మోటాపురంల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు మంత్రి హాజరు కానుండగా విజయవంతం చేయాలని కోరారు. మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: పూణే మున్సిపల్ కార్పొరేషన్(పీఎంసీ) తరహాలో ప్రజలు, అధికారులు, పాలకులు భాగస్వాములు అయితేనే నగరాలు అభివృద్ధి చెందుతాయని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. సోమవారం పూణే స్టడీ టూర్ అంశాలను కార్పొరేటర్లు, అధికారులతో కలిసి మేయర్ తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పూణేలో తడి, పొడి, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేరు చేసి ప్రజలే డస్ట్‌బిన్‌లో వేస్తున్నారని, ప్లాస్టిక్ వినియోగించడం లేదన్నారు. ప్రతీ ఇంటి నుంచి వచ్చే మురుగు నీరు అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ(యూజీడీ)లో కలిపి, దాని ద్వారా ఎస్టీపీలకు తరలిస్తున్నారని అన్నారు. ఫంక్షన్ హాల్‌లు, కమర్షియల్ భవనాల నిర్వాహకులు తమ వ్యర్థాలను కార్పొరేషన్ వారికి ఇవ్వకుండా వారే బయోగ్యాస్‌ను తయారు చేసుకుంటున్నారని, ఈ విధానం ఖమ్మంలో కూడా అమలు చేసేందుకు వీలున్న అంశాలను పరిశీలిస్తామన్నారు. రెండున్నర రోజుల పాటు టూర్‌కు వెళ్లిన ఖమ్మం నగర కార్పొరేటర్లు, అధికారులకు అక్కడ మంచి సహకారం అందించారని, కార్పొరేటర్లు పీఎంసీ అనుసరిస్తున్న విధానాలపై అవగాహన పొందడంతో పాటు పలు అనుమానాలను నివృత్తి చేసుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, బీజీ క్లైమెంట్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, కొత్తపల్లి నీరజ, రాపర్తి శరత్, ఈఈ కృష్ణాలాల్ పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

పలువురికి జరిమానా..

ఖమ్మంమయూరిసెంటర్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారికి, డ్రైయినేజీల్లో వ్యర్థాలు వేస్తున్న వారికి, భవన నిర్మాణ వ్యర్థాలు, మెటీరియల్ రోడ్డు వెంట వేసిన వారికి కేఎంసీ అధికారులు, సిబ్బంది జరిమానా విధించారు. సోమవారం పలు ప్రాంతాల్లో ఐదుగురికి కలిపి మొత్తం రూ.8 వేల జరిమానా విధించారు.

శానిటేషన్ పనులు..

నగరంలోని 5వ, 14వ, 18వ, 27వ, 49వ, 50వ డివిజన్లలో గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. డివిజన్‌కు 20 మంది కార్మికులను ఏర్పాటు చేసి పారిశుద్ధ్య పనులు చేయించారు. రోడ్డు పక్కన చెత్తను తొలగించారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేశారు.


బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నూతన బయోమెట్రిక్ మిషన్లు..

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేసే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరు నమోదు కోసం ఫేస్ ఐడెంటిటీ, థంబ్ వెరిఫికేషన్‌తో కూడిన నూతన మిషన్లను సోమవారం టెక్నీషియన్లు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేర్వేరుగా వీటిని ఏర్పాటు చేశారు. మరో రెండు రోజుల్లో హాజరు నమోదును ప్రారంభించనున్నారు.

ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న రామ్మూర్తి నాయక్

కూసుమంచి: ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తినాయక్ కోరారు. మండలంలోని లాల్ సింగ్‌తండాలో నిర్వహించిన గిరిజన సమాఖ్య మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ భద్రాచలంలో ఉండడం వలన జిల్లా ప్రజలకు ఇబ్బంది అవుతుందని, ఖమ్మం జిల్లా గిరిజనులకూ ఐటీడీఏ ఉండాలన్నారు. ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు పోడు పట్టాలను అందించాలని కోరారు. గిరిజనుల సమస్యలపై ఐక్యపోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గిరిజన సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా భూక్యా వీరన్న, కార్యదర్శిగా మల్సూర్ ఎన్నికయ్యారు. భూక్యా మల్సూర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ మండల కార్యదర్శి భూక్యా నర్సింహా, జిల్లా సమితి సభ్యుడు గుండెపొంగు మల్లేష్, నాయకులు ప్రసాద్, శ్రీకాంత్, ప్రశాంత్, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో సోలార్ ప్లాంట్


సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కమిటీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలో గల శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను సోమవారం ఆలయ కమిటీ బాధ్యులు ప్రారంభించారు. విద్యుత్ బిల్లు భారాన్ని తగ్గించుకునేందుకు 10 కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు కమిటీ చైర్మన్ బొల్లి కొమరయ్య తెలిపారు. ఇందులో రూ.లక్ష ఆలయం తరఫున చెల్లించగా, మిగతా మొత్తం దాతల సహకారంతో చెల్లించనున్నట్లు చెప్పారు. ప్రధాన అర్చకుడు నరగిరి రామాచార్యులు, కమిటీ బాధ్యులు పురం తిరుపయ్య, బానోత్ మల్సూర్, మేకల వీరన్న, బెల్లికొండలు, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కూసుమంచి: కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి(1999–2000 బ్యాచ్) చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను గుర్తు చేసుకుని ఒకరినొకరు పలకరించుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

అడ్డగోలుగా చెత్త సేకరణ..



వెంకటగిరి సమీపంలో రోడ్డుపక్కన పడేసిన చెత్త (ఇన్‌సెట్) రోడ్డుపైకి చేరిన చెత్త

- రోడ్డుపైకి చేరుతున్న చెత్తాచెదారం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరిలో ఆయా వార్డుల్లో మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ లేమితో సిబ్బంది చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. వెంకటగిరి, గుడిమళ్ల వార్డుల వీధుల్లో పేరుకుపోయిన చెత్తను సేకరించి వెంకటగిరి నుంచి గుడిమళ్ల మీదుగా ప్రధాన రహదారి పొడవునా పడేస్తున్నారు. దీంతో ఆ చెత్త రోడ్డుపైకి చేరడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి సమయాన అటుగా వెళ్లే వాహనదారులు ఆ చెత్తను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. గత రెండు రోజుల క్రితం ఓ ద్విచక్రవాహనదారుడు రోడ్డుపై పడిన చెత్తను గమనించక ప్రమాదానికి గురయ్యాడు. అయితే మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ఇలా జరుగుతోందనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా చెత్తాచెదారాన్ని గ్రామాలకు దూరంగా పడేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఖమ్మంరూరల్